



# కరపత్రం

SINCE 2014

శనివారం ఫిబ్రవరి 22 2025 | సంపుటి :0 | సంచిక : 131 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# పదేళ్ల పాలనపై..

## కేసీఆర్, కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధమా?: సీఎం రేవంత్‌రెడ్డి



- నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన.
- గత పదేళ్లలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు కేటాయించలేదని విమర్శ.
- ప్రజా ప్రభుత్వం కొత్తగా ఇళ్లు కేటాయించినట్లు ప్రకటించారు.
- పాలమూరు ప్రాజెక్టుల పూర్తికి గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణ.
- ముఖ్యమంత్రిగా, ఎంపీగా పాలమూరు గురించి పట్టించుకోలేదని ఆరోపణ.

అప్రయోజక రాజకీయాలు: గత ముఖ్యమంత్రులు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేసినా అభివృద్ధి చేయలేదని విమర్శ.

నారాయణపేట: గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు.

గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు.

2లో..



2లో

## మేడిగడ్డ కుంగిన వ్యవహారం..

### కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ

- మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు లో విచారణ జరిగింది.

## ఏపీ విజ్ఞప్తి..

### కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశం వాయిదా

- కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది.




2లో

### ప్రతి జిల్లాలో మహిళా

## సమాఖ్యలకు పెట్రోల్ బంకులు

- మహిళా సమాఖ్య సభ్యులకు ఏడాదికి రెండు చీరలు అందజేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

2లో

## పోలేపల్లిలో ఎల్లమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్



- వికారాబాద్ జిల్లా పోలేపల్లిలో రేణుక ఎల్లమ్మ తల్లిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు.

2లో

## నుమాయిష్‌లో మహిళల పట్ల అసభ్య ప్రవర్తన.. పోలీసుల అదుపులో 247 మంది నిందితులు

2లో

### అందరికీ రుణమాఫీ..

## అదో అందమైన కట్టుకథ

హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు.



2లో

## మిర్చి.. ఇసుకమేటల్లో ఎర్రతివాచీల్లా పరిచి!



ఏటూరునాగారం రూరల్ : ఇసుకమేటల్లో ఎర్రతివాచీలు పరిచినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం ములుగు జిల్లాలో ఆవిష్కృతమైంది. మన్యంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో వాణిజ్య పంట మిర్చి ఎక్కువగా సాగవుతోంది. ప్రస్తుతం చేతికందుతున్న మిర్చి పంటను గోదావరి ఇసుకమేటల్లో ఆరబెడుతున్నారు. తెల్లటి ఇసుక మధ్యలో ఎర్రటి మిర్చి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలోని ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట అంతర్రాష్ట్ర వంతెన కింద ఆరబెట్టిన మిరప పంటను తన కెమెరాలో బంధించింది.

## రేవంత్ రెడ్డి హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై కేసులు




హైదరాబాద్ : రేవంత్ రెడ్డి హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 22 2025

# సంపాదకీయం

## ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!



రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా చొరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకు రార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యా లయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది. ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏర డం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమా లకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాక పోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించి నట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు. దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయాచితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొద లెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

## నుమాయిష్‌లో మహిళల పట్ల అసభ్య ప్రవర్తన..
## పోలీసుల అదుపులో 247 మంది నిందితులు

మొదటిపేజీ తరువాయి

నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్-2025) సమయంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 247 మంది నిందితులను 'షీ టీమ్స్' పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మహిళల భద్రత డీసీపీ తెలిపారు.

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్-2025) సమయంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 247 మంది నిందితులను 'షీ టీమ్స్' పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మహిళల భద్రత డీసీపీ తెలిపారు. జనవరి 3 నుంచి ఫిబ్రవరి 17 వరకు కొనసాగిన నుమాయిష్‌లో మొత్తంగా 37 కేసుల్లో చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులకు 2 రోజుల జైలు శిక్ష, 33 మందికి రూ. 1,050 చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు. నిందితుల్లో 190 మందిని హెచ్చరికతో వదిలిపెట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 20 కేసులు విచారణ స్థాయిలో ఉన్నాయన్నారు. పట్టుబడ్డ 247 మందిలో 223 మంది పెద్దవారు, 24 మంది మైనర్లు ఉన్నారని చెప్పారు. ఈ మేరకు పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది.

## రేవంత్ రెడ్డి హామీలపై
## ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై కేసులు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ నేతలు ప్రజలపై మత్తు మందు చల్లారు. ఏడో గ్యారంటీగా ప్రజా పాలన అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రతీకార పాలన అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్ రెడ్డి కక్ష గట్టి ఓ నేరస్తుడు చక్రధర్‌తో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారు. అధికారులను పావులుగా వాడుకుని హరీశ్‌రావును ఎంతగా వేధించినా ప్రజల పక్షానే ఉంటారు. హరీశ్‌రావు ఏడు సార్లు సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొవిడ్ సమయంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారు. రేవంత్ రెడ్డిలాగా హరీశ్‌రావు ఓటుకు నోటు కేసులో పాలుపంచుకోలేదు. ఏదైనా చేసి దేంట్లోనైనా హరీశ్‌రావును ఇరికించాలని రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డిని హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీష్ రావుపై కక్ష గట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.
ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందుకు మానకొండూరు పీఎస్‌లో కేసు పెట్టారు. యాదాద్రిలో రేవంత్ రుణ మాఫీ ఒట్టు పెట్టి మాట నిలుపుకోనందుకు హరీష్ రావు ప్రశ్నిస్తే అక్కడ కూడా కేసు పెట్టారు. ఇలా చిన్న చిన్న అంశాల్లో హరీశ్‌రావుపై కేసులు పెడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు రేవంత్ అడుగులకు మడుగులొత్తుతున్నారు. పంజాగుట్ట కేసులో హరీశ్‌రావు దగ్గర కేవలం మూడు నెలలు పనిచేసిన వంశీని డీసీపీ చేసిన టార్చర్ అంతా ఇంతా కాదు. హరీశ్ రావు పేరు చెప్పాలని లేదంటే చంపేస్తామని డీసీపీ విజయ్ కుమార్ బెదిరించారు. నేను కూడా ఐపీఎస్ అధికారిగా పని చేశాను. సీఎంలు ఒత్తిడి చేసినంత మాత్రాన ఐపీఎస్ అధికారి పక్షపాతంతో వ్యవహరిస్తారా..? ఒత్తిడికి తలొగ్గలేమని చెప్పి విజయ్ కుమార్ లాంటి వాళ్ళు ఉద్యోగాలను వదిలివేయడం మంచిది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.
చక్రధర్‌పై రకరకాల కేసులు ఉన్నాయి. లైంగిక దాడి వంటి తీవ్ర నేరారోపణలు చక్రధర్‌పై ఉన్నాయి. 1900 మందిని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసు చక్రధర్‌పై ఉంది. కిడ్నాప్ కేసు కూడా చక్రధర్‌పై ఉంది. చక్రధర్ రేవంత్ ప్రోద్బలంతోనే హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు పెట్టారు. మొదట హైకోర్టులో రిట్ వేసి చక్రధర్ విత్ డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత పంజాగుట్టలో ఫిర్యాదు చేయగానే కొన్ని గంటల్లోనే హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి హరీశ్‌రావు, ఆయన అనుచరగణంపై పోలీసులు కక్ష గట్టి వ్యవహరిస్తున్నారు అని ఆర్ఎస్పీ తెలిపారు.

## అందరికీ రుణమాఫీ..
## అదో అందమైన కట్టుకథ

మొదటిపేజీ తరువాయి

అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరి గారికి ఏం సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు నిలదీశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.
ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ఆరేళ్ల బాలుడు

మాసబ్‌ట్యాంక్ శాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆరేళ్ల బాలుడు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు.



హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్ శాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆరేళ్ల బాలుడు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు. లిఫ్ట్‌లో వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా ఆగిపోవడంతో భయాందోళనకు గురైన బాలుడు కేకలు వేశాడు. గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే అగ్నిమాపక, డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న సిబ్బంది వెల్డింగ్ మిషన్‌ల సాయంతో లిఫ్ట్ డోర్‌లు తొలగించి బాలుడిని బయటకు తీశారు. స్పృహ తప్పి పడిపోయిన బాలుడిని చికిత్స కోసం నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. సాంకేతిక లోపం కారణంగానే లిఫ్ట్ మధ్యలో నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## బీఈడీ, ఎంఈడీ కోర్సుల వన్ టైం ఛాన్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఈడీ (ఇయర్ వైజ్), బీఈడీ (సెమిస్టర్ వైజ్), ఎంఈడీ (సెమిస్టర్ వైజ్) వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

ఎంబీఏ వన్ టైం ఛాన్స్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ వన్ టైం ఛాన్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## పదేళ్ల పాలనపై..
### కేసీఆర్, కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధమా?: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాది" అని సీఎం అన్నారు.

## ప్రతి జిల్లాలో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులు

మొదటిపేజీ తరువాయి

నారాయణపేట: మహిళా సమాఖ్య సభ్యులకు ఏడాదికి రెండు చీరలు అందజేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నారాయణపేట జిల్లా పర్యటనలో భాగంగా అప్పక్‌పల్లెలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
"రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్యలో మొత్తం 67లక్షల మంది ఉన్నారు. ఈ సభ్యులకు ఇకపై రూ. 1000 కోట్ల ఖర్చుతో ఏడాదికి రెండు మంచి చీరలు ఇస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటును మహిళలు నిర్వహించబోతున్నారు. తొలుత ప్రతి జిల్లాలో ఒక చోట ప్రభుత్వ భూముల్లో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తాం. ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కటైనా ఉండేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో స్కూళ్ల నిర్వహణ బాగుండేలా మహిళలు చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు లేకపోయినా, వసతులు సరిగా లేకపోయినా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లండి. నిధులు నేనిస్తా.. నిర్వహణ మీ చేతుల్లో ఉంటుంది. నిధులు ఇచ్చినా నిర్వహణ బాగాలేకపోతే ప్రయోజనం ఉండదు. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహిస్తున్నామో బడి కూడా అలాగే నిర్వహించాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## పోలేపల్లిలో ఎల్లమ్మ తల్లికి పట్టువస్త్రాలు
## సమర్పించిన సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

దుద్యాల: వికారాబాద్ జిల్లా పోలేపల్లిలో రేణుక ఎల్లమ్మ తల్లిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (%=వఝుత్ష్ట తీవ‌ఎ‌ఎ%) దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు రేవంత్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మేడిగడ్డ కుంగిన వ్యవహారం..
### కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు లో విచారణ జరిగింది. రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు.
విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## ఏపీ విజ్ఞప్తి..
### కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశం వాయిదా

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకు నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది.
అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్.. బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.

# జర్నలిస్టులకు ఆకాశమే హద్దు...

**- సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులే**
**- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి రామచంద్రం**



**కరపత్రం హనుమకొండ:**
జర్నలిస్టులకు ఆకాశమే హద్దు అని, లిమిట్స్ ఉండవని, సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు మాత్రమే అని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్ డేకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ...జర్నలిజం విద్యార్థులకు లీడర్షిప్ క్వాలిటీస్ ఉంటాయని సమస్యల మీద ఎప్పటికప్పుడు ముందుంటారని, ఆ సమస్యల పరిష్కారానికి పాటుపడతారన్నారు. విద్యార్థులు భాష నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడు వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అబ్బాయిల కంటే అమ్మాయిలకు ఇంకా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, టీవీ మీడియాలో అమ్మాయిలు ఇప్పుడు ఎక్కువగా కనబడుతున్నారన్నారు. జర్నలిజం విభాగంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని, అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ...విద్యార్థులు రెగ్యులర్ గా క్లాసులకు హాజరు కావాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో వారి అనుభవాలను రంగరించి ఎన్నో మెలుకువలను తెలుసుకునేందుకు విద్యార్థులు కష్టపడితే విద్యార్థులందరూ కూడా త్వరగా సెటిలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సిడిఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్ మాట్లాడుతూ...అన్ని కోర్సుల కంటే జర్నలిజం కోర్స్ ముఖ్యమైనదని, దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ సి డైరెక్టర్ ఐలయ్య, కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సుధాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి తో పాటు మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.
12

# తెలుగు భాష బతకాలి
# తెలుగు భాషను బతికించాలి

**" కరుణాకర్ మల్లిగారి,కరపత్రం మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి "**




వ్యాసకర్త
ఆకుల కరుణ ఉపాధ్యాయురాలు.

భాష అనేది జాతి గౌరవాన్ని, సంస్కృతిని,చరిత్రను ప్రతిబింబించే శక్తివంతమైన సాధనం. మన తెలుగు భాష తన సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలను సాధించి, ఎన్నో ఘనతలు అందుకుంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా, మన భాష గొప్పతనాన్ని, వైభవాన్ని స్మరించుకోవడం మన బాధ్యత.

తెలుగు భాష - ఒక సాహిత్య శిఖరంనాగబు గా పుట్టింది తెలుగు పాల్కురికి రచనలో పాలు పొంగించింది తెలుగు నన్నయ్య కలంలో నాట్యం చేసింది తెలుగు తిక్కన్న కావ్యమై తిరిగింది తెలుగు శ్రీనాథుని చెంత శిఖరమెక్కింది తెలుగు పోతన కవితతో పోరు బాట పట్టింది తెలుగు వేమన పద్యమై వెలిగి గురజాడ తో గురిచూసి వీరేశలింగం తో విజృంభించి శ్రీశ్రీ మహాప్రస్థానం అయ్యింది తెలుగు దాశరథి గా దశదిశలా వ్యాప్తి చెంది విశ్వనాథుని కల్ప వృక్షమై కాళోజీ గా కదనరంగంలో దూకి గద్దర్ గా గర్జించి విశ్వనరుని (సినారె) చేతిలో విశ్వంభర మై జ్ఞానపీఠం ఎక్కింది మన తెలుగు. తెలుగు భాష విశిష్టత తెలుగు భాష ప్రపంచంలో అత్యంత మధురమైన భాషలలో ఒకటి. ఇది ప్రపంచంలోనే ప్రాచీన భాషలలో ఒకటి, 2000 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగి ఉంది.మన భాషకు జ్ఞానపీఠం గెలుచుకున్న కవులు ఉన్నారు, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. భాషా వైవిధ్యం, కవితా శైలి, సాహిత్య సంపద మనకు ప్రత్యేకమైన గుర్తింపు ఇస్తాయి. తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత మనదే ఈ గ్లోబలైజేషన్ యుగంలో, మన మాతృభాషను పరిరక్షించడం, ప్రోత్సహించడం అత్యవసరం. మన పిల్లలతో తెలుగులో మాట్లాడడం, తెలుగు సాహిత్యాన్ని చదవడం, కొత్త తరం కోసం భాషను సులభతరం చేయడం మనందరి బాధ్యత. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా, మన మాతృభాషలో మాట్లాడేందుకు, రాసెందుకు, అభిమానం పెంచేందుకు కృత నిశ్చయంతో ముందడుగు వేయాలి. తెలుగు భాషను జాగ్రత్తగా కాపాడుకోవడం ద్వారా, మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించగలం.
"తెలుగు భాష బతకాలి, తెలుగు భాష బతికించాలి" - ఇది మనందరి సంకల్పం కావాలి.

# నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత కార్యకర్తలదే...

**- మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి..**



**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 21**
పట్టబద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన ఊట్కూరి నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత కార్యకర్తల దేనని మానకొండూర్ సాధన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. కరీంనగర్ అదిలాబాద్ నిజాంబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన ఊట్కూరి నరేందర్ రెడ్డి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ను తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము, ఇందిరమ్మ పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్గం, శాసనమండలి, శాసనమండలి ఆమోదంతో, ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించి, ఈనెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ నిజామాబాద్ది ఆలాబాద్ మెదక్ ఎమ్మెల్సీగా ఆల్ఫోర్స్ అధినేత ఊట్కూరు నరేందర్ రెడ్డి కి పట్టబద్దులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల పనిచేసే, పార్టీ అభివృద్ధికి నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్యే సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, టీపీసీసీ సభ్యులు మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మహిళా మండల శాఖ అధ్యక్షురాలు చింతి రెడ్డి పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవ్వ పద్మ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ చంద్రమౌళి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డి పవన్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆడెపు అజయ్, సర్పంచులు తాటికొండ సదానంద చారి,గొడశాల రాజ కొమురయ్య, నాయకులు బండారి తిరుపతి, చీకట్ల కుమార్, రాయిని రమేష్, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన దళిత ఎమ్మెల్సీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్

**- దళిత ఎం ఎల్ సి అభ్యర్థి అయిన నాపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన ఆల్ఫారెస్ నరేందర్ రెడ్డి వారి అనుచరులు పై ఎలక్షన్ కమిషన్ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు**



**కరపత్రం దినపత్రిక ప్రతినిధి. ఫిబ్రవరి 21**
తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టుభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి దేవతి శ్రీనివాస్ ఫిబ్రవరి 21,2025 రోజు నాడు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ తెలంగాణ, ప్రభుత్వ అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ని, డిప్యూటీ ఎన్నికల ప్రధాన అధికారి ఎం. సత్యవాణిని, కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి కరీంనగర్ లో దళిత స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి అయినా దేవతీ శ్రీనివాస్ అను నాపై ఆల్ఫారెస్ నరేందర్ రెడ్డి, వారి అనుచరులు దాడి చేసిన విషయమై వివరిస్తూ వారి పైన చట్టపైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది.అలాగే నిజామాబాద్ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ తన ఛాంబర్ లో నాపట్ల కులవక్షకు గురి చేసినందుకు తన పైన చట్టపైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సమావేశంలో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్,ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తీగల అశోక్ కుమార్ పాల్గొనడం జరిగింది.



# మల్లారెడ్డిపల్లిలోరామాంజనేయ గుడి నిర్మాణానికి 1,00,116 రూపాయల భారీ విరాళం...

**- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసిన గంధం లక్ష్మణ్ - రజిత దంపతులు..**



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 21.**
వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాంజనేయ దేవాలయానికి, అదే గ్రామానికి చెందిన గంధం లక్ష్మన్-రజిత దంపతులు వెటర్నరీ ఆఫీసర్స్ వారి తల్లి తండ్రులు అయినటువంటి గంధం రాజయ్య- రాజమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం 1,00,116/- ఒక లక్ష నూటపదహారు రూపాయలు గుడి నిర్మాణానికి భారీ విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, పల్లెర్ల కిరణ్, గంధం బాలస్వామి, మేకల సుధాకరెడ్డి, సంధి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కీసర గుట్ట బ్రహ్మోత్సవాలకు మంత్రి కొండ సురేఖకీ మరియు పిసిసి అధ్యక్షులకు ఆహ్వానం


**" కరుణాకర్ మల్లిగారి,కరపత్రం మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి "**





మేడ్చల్ జిల్లా కీసరలో శివరాత్రి సందర్భంగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు,మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖకి మరియు పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి వారి నివాసంలో కలిసి ఆహ్వానించారు. మంత్రివర్యులను, పిసిసి అధ్యక్షులను కలిసిన వారిలో కీసర గుట్ట చైర్మన్ తాటకం నారాయణ శర్మ, టెంపుల్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపి



**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 21.**
పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లిలో మాజీ జెడ్పిటిసి బండారి రామ్మూర్తి ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి హాజరై,సెంటనారి కాలనీ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ్,రాణి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.వారి దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కుటుంబ సభ్యులు, సన్నిహితులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



**- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్**

**కరపత్రం -జమ్మికుంట:**
ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నరేందర్ రెడ్డి కి మద్దతుగా జమ్మికుంట పట్టణంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేందర్ రెడ్డి ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా పేద విద్యార్థులను సైతం ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి రాజయ్య, గడిపే శ్రీనివాస్, రొంటాల కుమారస్వామి, కుమారస్వామి, అలగం రామకృష్ణ, అశోక్ అభిలాష్, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గృహరుణం వడ్డీ రేటు తగ్గలేదా?

**కరపత్రం డెస్క్ ప్రతినిధి.ఫిబ్రవరి 21**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేటు రెపోను 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. ఈ నేపథ్యంలో రెపో ఆధారిత రుణ వడ్డీ రేట్లు (ఆర్ఎల్ఎల్ఆర్)ను తగ్గించేందుకు ఇప్పటికే పలు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వడ్డీ రేటు పావు శాతం తగ్గి, చాలామంది గృహరుణ గ్రహీతలకు ప్రయోజనం చేకూరుతోంది.



ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది.. చాలామంది అనుకున్నట్లు గృహరుణంపై వడ్డీ రేట్లు తగ్గితే బ్యాంకులు వెంటనే నెలవారీ వాయిదాలు (ఈఎంఐ) తగ్గించవు. ఇక్కడ తగ్గేది వ్యవధి మాత్రమే. ఇక మీ వడ్డీ రేటూ తగ్గలేదు అనుకుంటే దానికి కొన్ని కారణాలు ఉంటాయి.

### ఫిక్స్‌డ్ రేటులో..

మీరు తీసుకున్న గృహరుణానికి చలన వడ్డీ (ఫ్లోటింగ్) లేదా స్థిర వడ్డీ (ఫిక్స్‌డ్)లో ఏది వర్తిస్తుందో ముందుగా తెలుసుకోండి. ఒకవేళ స్థిర వడ్డీ వర్తిస్తే మీ వడ్డీ రేటు తగ్గదు. సాధారణంగా మూడేళ్లు స్థిరం ఆ తర్వాత చలన వడ్డీ రేటుకు మారేలా రుణ ఒప్పందం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రుణ వ్యవధి మొత్తం స్థిర వడ్డీనే ఉండొచ్చు. కాబట్టి, ముందుగా బ్యాంకును సంప్రదించి, మీ రుణానికి ఏ వడ్డీ వర్తిస్తోందో తెలుసుకోండి. స్థిర వడ్డీతో ఉంటే.. దాన్ని చలన వడ్డీకి మార్చుకునే ప్రయత్నం చేయొచ్చు. ఇందుకోసం బ్యాంకులు కొంత రుసుమును వసూలు చేస్తాయి.

### చలన వడ్డీలో..

కొన్నిసార్లు చలన వడ్డీ రేటు విధానంలో ఉన్నా.. ఈ తగ్గింపును బ్యాంకులు వర్తింపచేయవు. ఇందుకూ ఒక కారణం ఉంది. చలన వడ్డీ రేటు విధానంలో నిధుల ఆధారిత రుణ వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారంగా మీ రుణం ఉందనుకోండి.. అప్పుడూ వడ్డీ తగ్గకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనూ బ్యాంకును సంప్రదించాలి. రెపో ఆధారిత రుణ వడ్డీ రేటుకు మారేందుకు ప్రయత్నించాలి. ఇందుకోసం బ్యాంకులు కొంత రుసుమును వసూలు చేస్తుంటాయి. ఈ రుసుము రుణ మొత్తాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మీ బ్యాంకు శాఖను సంప్రదించి లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లోనూ ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో రెపో రేటు ఆధారిత వడ్డీ రేటుకు మారడమే మంచిది. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకే ఈ తగ్గింపు వెంటనే అమల్లోకి వస్తుంది. గృహరుణ సంస్థల నుంచి రుణం తీసుకున్నప్పుడు, ఆయా సంస్థలు వడ్డీ రేటును సవరించినప్పుడే, మీ రుణంపై వడ్డీ తగ్గుతుంది. ఈ తగ్గింపును పొందేందుకు కొంత రుసుము చెల్లించక తప్పదు.

## ఎస్‌బీఐ గృహ రుణ వినియోగదారులకు గుడ్‌న్యూస్.. తగ్గనున్న ఈఎంఐ




**కరపత్రం డెస్క్ ప్రతినిధి.ఫిబ్రవరి 21**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. ఫిబ్రవరి 15 నుంచి సవరించిన రేట్లు అమల్లోకి వచ్చాయి.

ఇంటర్నెట్ డెస్క్: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ గృహరుణ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్ , రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను తగ్గించింది. సవరించిన రేట్లు ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియారెపో రేటును 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. ఎంసీఎల్ఆర్, బీపీఎల్ఆర్ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

గృహ రుణాలకు రెపోరేటును అనుసంధానం చేసేందుకు ఈబీఎల్ఆర్ విధానాన్ని 2019 అక్టోబర్ 1 నుంచి ఎస్‌బీఐ అనుసరిస్తోంది. ఆర్‌బీఐ రెపోరేటు మార్చినప్పుడల్లా ఈ రేటు మారుతూ ఉంటుంది. తాజాగా ఈబీఎల్ఆర్‌ను 9.15 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.90 శాతానికి చేర్చింది. దీంతో ఈబీఎల్ఆర్‌తో అనుసంధానం అయిన హోమ్‌లోన్స్, పర్సనల్ లోన్స్, ఇతర రిటైల్ లోన్స్‌పై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి.

ఆర్‌బీఐ రెపో రేటుకు అనుసంధానం అయిన ఆర్ఎల్ఎల్ఆర్ సైతం 25 బేసిస్ పాయింట్లను ఎస్‌బీఐ తగ్గించి 8.50 శాతానికి తగ్గించింది. దీంతో గృహ రుణాలు, బిజినెస్ రుణాలు ఆ మేరకు తగ్గనున్నాయి. ఈ రెండు రకాల వడ్డీ రేట్లను ఎస్‌బీఐ తగ్గించిన నేపథ్యంలో ఆయా రుణాలు తీసుకున్న వారికి ప్రయోజనం కలగనుంది. ఆమేర రుణ గ్రహీతలు ఈఎంఐలు గానీ, చెల్లించే కాలవ్యవధిని గానీ తగ్గించుకునే వెసులుబాటు లభిస్తుంది. మరిన్ని వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును సవరించిన నేపథ్యంలో ఇప్పటికే కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా రెపో ఆధారిత రుణ రేట్లను 0.25 శాతం మేర తగ్గించాయి.

# పెళ్లికి ముందే క్రెడిట్ స్కోరు తెలుసుకోండి

**కరపత్రం డెస్క్ ప్రతినిధి.ఫిబ్రవరి 21**

వరుడి సిబిల్ స్కోరు తక్కువగా ఉందని ఇటీవల మహారాష్ట్రలో ఒక పెళ్లి ఆగిపోయిన సంగతి గుర్తుందా.. విషయం ఏమిటంటే.. పెళ్లి కొడుకు ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని వధువు మేనమామ అనుకున్నారు. అబ్బాయి క్రెడిట్ స్కోరును పరిశీలించాలని పట్టుబట్టారు. వాటిని చూసి, క్రెడిట్ స్కోరు 600 కన్నా తక్కువగా ఉందని, పలు బ్యాంకుల్లో రుణాలున్నాయని తెలుసుకున్నారు. దీంతో అమ్మాయికి ఆర్థిక భద్రత కల్పించలేరని చెప్పి, ఆ వివాహాన్ని రద్దు చేసుకున్నారు. ఇది కాస్త ఆశ్చర్యం కలిగించే విషయమే. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది తప్పనిసరిగా పరిశీలించాల్సిన విషయం అని వ్యక్తిగత ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వివాహం.. జీవితంలో ఒక కీలక దశ. ఇద్దరు వ్యక్తులు కలిసి కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం. ప్రేమ, నమ్మకం, అవగాహన వంటివి ఎంత ముఖ్యమో.. ఆర్థిక విషయాలూ అంతే ప్రధానం. ఈ నేపథ్యంలో కాబోయే జీవిత భాగస్వామి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకోవడం చాలా అవసరం. దీనికి అందుబాటులో ఉన్న మార్గం క్రెడిట్ స్కోరును పరిశీలించడం. ఇది 750కి మించి ఉంటేనే బాగున్నట్లు లెక్క.

క్రెడిట్ స్కోరు వ్యక్తి ఆర్థిక చరిత్రకు అద్దం లాంటిది. తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపుల తీరు, క్రెడిట్ కార్డుల వినియోగం, ఎన్నిసార్లు అప్పుల కోసం దరఖాస్తు చేశారు? తదితర ఎన్నో వివరాలను తెలియజేస్తుంది. ఆర్థిక క్రమశిక్షణ ఎలా ఉందో ఈ నివేదికను చూస్తే స్పష్టమవుతుంది. ఆర్థిక పారదర్శకత: పెళ్లికి ముందు ఆర్థిక విషయాల గురించి మాట్లాడుకోవడం కొంచెం ఇబ్బందిగానే అనిపించవచ్చు. కానీ, ఇది చాలా ముఖ్యమైన విషయం అని గుర్తుంచుకోవాలి. కాబోయే భాగస్వామి క్రెడిట్ స్కోరు గురించి తెలుసుకోవడం వల్ల వారిద్దరి మధ్య ఆర్థిక పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో డబ్బుకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తు ప్రణాళిక: కాబోయే భాగస్వామి క్రెడిట్ స్కోరు వారి ఆర్థిక భవిష్యత్తును అంచనా వేసేందుకు సహాయపడుతుంది. ఉదాహరణకు క్రెడిట్ స్కోరు తక్కువగా ఉంటే రుణాలకు అధిక వడ్డీ రేటు చెల్లించాల్సి వస్తుంది. ఇది మీ ఉమ్మడి ప్రణాళికలను ప్రభావితం చేస్తుంది. ఇల్లు కొనడం, పిల్లల చదువు, పదవీ విరమణ వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ క్రెడిట్ స్కోరు ఉపయోగపడుతుంది.

రుణాల నిర్వహణ: డబ్బు గురించి మీ భాగస్వామికి ఎలాంటి ఆలోచన ఉందన్న విషయాన్ని క్రెడిట్ స్కోరు స్పష్టం చేస్తుంది. తీసుకున్న అప్పులను ఎంత క్రమశిక్షణతో చెల్లిస్తున్నారన్నదీ తెలుసుకోవచ్చు. కాబోయే భాగస్వామికి అప్పులు ఉన్నప్పుడు వాటిని ఎలా తీర్చబోతున్నారు, అందుకు వేసుకున్న ప్రణాళికలనూ కలిసి చర్చించుకోవచ్చు. క్రెడిట్ స్కోరు బాగాలేకపోతే దాన్ని మెరుగుపర్చుకునేందుకు ఒకరికొకరు సహాయం చేసుకోవచ్చు.

నమ్మకం: ఆర్థిక విషయాల్లో పారదర్శకత ఇద్దరి మధ్యా నమ్మకాన్ని పెంచుతుంది. దీనివల్ల భవిష్యత్తులోనూ ఎలాంటి మనస్పర్థలూ రాకుండా ఉంటాయి.

ఉమ్మడి లక్ష్యాలు: ఇద్దరూ కలిసి ఉమ్మడి ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు క్రెడిట్ స్కోరు ఉపయోగపడుతుంది. ఇద్దరూ కలిసి ఇల్లు కొనాలనుకుంటే.. క్రెడిట్ స్కోరు ఆధారంగా ఎవరికి ఎంత రుణం రావచ్చు, వడ్డీ రేట్లు ఎలా ఉంటాయన్న విషయంలో ఒక అంచనాకు రావచ్చు.

ఖర్చుల నియంత్రణ: క్రెడిట్ కార్డుల్లాంటివి వాడుతూ ఉంటే.. ఖర్చులను నియంత్రించుకొని, భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు ఏం చేయాలన్నదీ ప్రణాళిక వేసుకోవచ్చు.

కాబోయే జీవిత భాగస్వామితో క్రెడిట్ స్కోరు, రుణాలు, ఆర్థిక ప్రణాళికల్లాంటివి చర్చించడం కొంచెం కష్టమే కావచ్చు. ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. ఆలోచనల పరంగా ఎంతో ముందుంటున్న యువ జంటలు దీనిపై చర్చించేందుకు సందేహించకూడదు. ఇది మీ భవిష్యత్తుకు సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం. ఆర్థిక విషయాల్లో పారదర్శకత, అవగాహన మీ బంధాన్ని మరింత బలపరుస్తుందని గుర్తుంచుకోండి.




# పెట్టుబడి విలువ పడిపోతుంటే...

**కరపత్రం డెస్క్ ప్రతినిధి.ఫిబ్రవరి 21**

భారతీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల హెచ్చరికలు.. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, విదేశీ సంస్థాగత మదుపరులు లాభాల స్వీకరణ.. ఇలా ఎన్నో కారణాలు మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో ఈక్విటీ ఆధారిత ఫండ్ల నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ)లు గణనీయంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఫండ్ ఎన్ఏవీలు తగ్గుతుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుసుకుందాం! 'మ్యూచువల్ ఫండ్లు మార్కెట్ ఆధారంగా పనిచేస్తాయి'.. ఈ హెచ్చరిక ప్రతి ఫండ్ పథకంపైనా ఉంటుంది. ఒక్క మ్యూచువల్ ఫండ్లే కాదు.. స్టాక్ మార్కెట్‌తో సంబంధం ఉన్న ఏ పెట్టుబడికైనా ఇదే నిబంధన వర్తిస్తుంది. నష్టభయం ఉన్న చోటే రాబడి అధికంగా వస్తుంది. సాధ్యమైనంత వరకూ నష్టాన్ని తగ్గించుకుంటూ.. లాభాలను పెంచుకోవాలి. కారణాలేమైనా సరే.. మీ మ్యూచువల్ ఫండ్ పథకాలపై వచ్చే రాబడి తగ్గినా.. లేదా ప్రతికూలంగా వచ్చినా ఏం చేయాలన్నది ఇక్కడ కీలకం.



### మంచి పథకమేనా?

మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేటప్పుడు ఫండ్ ఎంపిక దశలోనే మొదటి జాగ్రత్త తీసుకోవాలి. ఏ ఫండ్‌లో మదుపు చేయాలన్నది సరిగా చూసుకోకుండా పెట్టుబడులు పెట్టి చాలామంది పొరపాటు చేస్తుంటారు. ఫండ్ గత చరిత్రను పరిగణనలోకి తీసుకొని, ఆయా పథకాలను ఎంచుకోవడం సాధారణంగా పాటించే విషయం. కానీ, ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. గత పనితీరు భవిష్యత్తులోనూ కొనసాగుతుందనేదానికి ఎలాంటి హామీ ఉండదు. ఫండ్ల ఎంపికలో పాటించే మరో విధానం రేటింగులను చూడటం. ఇదీ సరైన పద్ధతి కాదు. రేటింగులకు బదులు వ్యక్తిగతంగా నష్టభయం భరించే సామర్థ్యం ఎలా ఉంటుందన్నది చూడాలి. కొన్నిసార్లు మంచి రేటింగ్ ఉన్న ఫండ్లను ఎంచుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇవన్నీ ఫండ్ ఎంపికలో కొంత సహాయం చేస్తాయి. కానీ పూర్తిగా వీటిపైనే ఆధారపడకూడదు. పెట్టుబడి పెట్టబోయే ఫండ్ పనితీరును అర్థం చేసుకోవాలి. దాని లక్ష్యం, వ్యూహం ఏమిటో తెలుసుకోవాలి. నష్టభయం వచ్చే అవకాశం ఎంతుంది? అందులో ఎంత వ్యవధి కొనసాగితే మేలు.. ఇలా అన్ని వివరాలనూ పరిశీలించాకే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఇదే విభాగంలో ఉన్న ఇతర పథకాలతో పోలిస్తే.. ఇది ఎందుకు మేలన్నది అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి.

### ప్రతికూలంగా ఉంటే..

మీరు ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్న మ్యూచువల్ ఫండ్ పథకాలు.. ప్రతికూల రాబడులు ఇస్తే ఏం చేయాలి? ముందుగా మీరు ఎంచుకున్న ఫండ్ పథకాలు సరైనవేనా సమీక్షించుకోండి. మీరు పథకాల ఎంపికలో పొరపాటు చేస్తే దాన్ని దిద్దుకోండి. వాటిల్లో సిప్ చేస్తుంటే వెంటనే ఆపేయండి. ఆ సిప్‌ను మంచి పనితీరు ఉన్న పథకానికి మళ్లించండి. కొత్త పథకం ఎంపికలో కనీస జాగ్రత్తలు పాటించండి. పాత ఫండ్‌లో నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు సరైన సమయమేనా చూసుకోండి. ఎన్ఏవీ మరీ తక్కువగా ఉంటే.. కొన్నాళ్లు వేచి చూస్తే లాభం ఉంటుందా? చూసుకోవాలి. అవసరాన్ని బట్టి, నిపుణుల సలహాలు తీసుకోవాలి.

కొన్నిసార్లు తాత్కాలిక కారణాల వల్ల ఫండ్ పనితీరు కొంత దెబ్బతినవచ్చు. ఇలాంటప్పుడు ఆందోళన చెందకుండా అది మళ్లీ గాడిన పడేదాకా వేచి చూడాలి.

### సమీక్షించుకోండి..

మ్యూచువల్ ఫండ్లలో మంచి రాబడి రావాలంటే. వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ.. అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలి. ఇది రోజువారీ ప్రక్రియ కాకూడదు. ఒక నిర్ణీత కాలాన్ని పెట్టుకొని, వాటిని పరిశీలించాలి. విశ్లేషణలో తేలిన అంశాల ఆధారంగా వేటిని వదిలించుకోవాలి. వేటిని అట్టిపెట్టుకోవాలి అనేది తెలిసిపోతుంది. అప్పుడే క్రమం తప్పకుండా నాణ్యమైన పోర్ట్‌ఫోలియోను సృష్టించుకోగలరు.

### వైవిధ్యమే మేలు..

సరైన ఫండ్‌ను ఎంపిక చేసుకుంటేనే సరిపోదు. అది ఎంత వరకూ వైవిధ్యంగా ఉందన్నదీ ముఖ్యమే. ఉదాహరణకు ఐదు మంచి లార్జ్ క్యాప్ ఫండ్లను ఎంచుకున్నారనుకుందాం. అయినప్పటికీ మీరు నష్టపోవచ్చు. అదెలా అనే కదా మీ అనుమానం. ఒకే పెట్టుబడి వ్యూహానికి పరిమితమైన ఫండ్లలోనే మదుపు చేయడం ఇక్కడ పొరపాటు. ఐదు ఫండ్లలో మదుపు చేయాలనుకున్నప్పుడు అవి వైవిధ్యంగా ఉండేలా చూసుకున్నప్పుడే నష్టభయం పరిమితం అవుతుంది. ఒక ఫండ్ పనితీరు సరిగా లేకపోయినా మరో ఫండ్ ఆ నష్టాన్ని భర్తీ చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితినే విశ్లేషిస్తే.. ఈక్విటీ ఫండ్లలోనే మొత్తం పెట్టుబడి పెట్టారనుకుందాం. ఏమిటి పరిస్థితి.. అందుకే, ఎప్పుడూ పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండాలని చెప్పేది. ఈక్విటీ, హైబ్రిడ్, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, డెట్ ఇలా వైవిధ్యమైన పనితీరు ఉన్న పథకాలను ఎంచుకోవాలి. అన్ని రకాల పెట్టుబడి వ్యూహాలతో పనిచేసే ఫండ్లలో మదుపు చేయడం ద్వారా నష్టభయాన్ని తగ్గించుకుంటూ.. రాబడిని పెంచుకోవచ్చు.